# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



**విలేకరులు కావలెను**

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 204 | పేజీలు : 08 | మంగళవారం | 04-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## నిమ్స్ మరో రికార్డు

**రెండున్నరేళ్లలో 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సలు**

**90 శాతానికి పైగా ఉచిత సేవలు**



హైదరాబాద్ పల్స్,డెస్క్

హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) మరో అరుదైన ఘనత సాధించింది. రెండున్నరేళ్లలో 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించింది. రోబోటిక్ టెక్నాలజీతో క్లిష్టమైన శస్త్రచికిత్సలను మరింత ఫర్ ఫెక్ట్ గా చేయడంతో పాటు రోగులకు నొప్పి, రక్తస్రావం తక్కువగా ఉండటంతో త్వరగా కోలుకుంటున్నారు. ఈ మొత్తం శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 శస్త్రచికిత్సలు నిర్వహించారు మొత్తం శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా రోగులకు ఉచితంగా చేశారు. సాధారణంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చయ్యే రోబోటిక్ శస్త్రచికిత్సలను ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందించడం ద్వారా పేదలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని నిమ్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవ్‌రాజ్ మాట్లాడుతూ, ఈ ఘనత వైద్యులు, స్టాఫ్ ,అన్ని విభాగాల సమష్టి కృషి ఫలితమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోనే ఈ స్థాయిలో సేవలు అందించగలిగామని చెప్పారు.

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్

# శస్త్రచికిత్సలు పూర్తి



హైదరాబాద్ పల్స్,డెస్క్

రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్? డైరెక్టర్? రాహుల్? దేవరాజ్?తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్?లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

## జోగినులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల వేడుకల్లో పాల్గొన్న పొన్నం ప్రభాకర్
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి
- జోగినులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడి



హైదరాబాద్ పల్స్,డెస్క్

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో

## బెయిల్ మంజూరు

- కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు..
- భూకబ్జా కేసులో కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్
- ఆరోగ్య కారణాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసిన శ్రీకాకుళం కోర్టు
- ఈ కేసులో ఏ5గా చిరంజీవి, ఏ6గా తమ్మినేని సీతారాం, ఏ7గా ఆయన భార్య వాణిశ్రీ
- ఈ నెల 10వ తేదీన విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశం

## "ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?"..

**సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు**



- నిరుద్యోగుల అంశంలో కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు
- యూత్ డిక్లరేషన్ హామీలు అమలు కావడం లేదని ఆరోపణ
- పోలీసు నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీత
- రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం రాహుల్ గాంధీ
- స్పందించాలని డిమాండ్ రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై ప్రశ్నలు

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

## కర్ణాటక కేబినెట్ విస్తరణ

**చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు**



- కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి
- చివరి నిమిషంలో జాబితా నుంచి మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

## ఎన్నికల రాజకీయాల్లోకి కాక్రోచ్ పార్టీ?

**స్పష్టతనిచ్చిన అభిజిత్ దీప్కే**

- సీజేపీ బలోపేతమే తొలి లక్ష్యమన్న దీప్కే
- వాలంటీర్లతో సమీక్ష తర్వాత భవిష్యత్ కార్యాచరణ
- ప్రజల్లో భయం పోవడమే ఉద్యమ అసలు విజయం
- ఎన్నికల రాజకీయాలపై ప్రస్తుతం ఆసక్తి లేదని స్పష్టీకరణ
- ప్రజా ఉద్యమాలే ప్రజాస్వామ్యానికి బలమని అభిప్రాయం
- నిరుద్యోగం, విద్య రాజకీయ అంశాలేనని వ్యాఖ్య



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఢిల్లీ విద్యార్థుల ఆందోళన తర్వాత తమ తొలి లక్ష్యం సంస్థను మరింత బలోపేతం చేయడమేనని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే చెప్పారు. ఉద్యమం ఆరంభంలో తమతో 10 నుంచి 20 మంది మాత్రమే

## రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ



## "మిస్టర్ డ్రామారావు"

**అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్**

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య



# జోగినులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

మొదటి పేజీ రువాయి

పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు. జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# కర్ణాటక కేబినెట్ విస్తరణ

మొదటి పేజీ రువాయి

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు. సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు. వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగి

# బెయిల్ మంజూరు

మొదటి పేజీ రువాయి

శ్రీకాకుళం జిల్లా చాపరం భూకబ్జా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట చిరంజీవి నాగ్ సోమవారం శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయారు. విచారణ సందర్భంగా ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. భూ కబ్జా ఆరోపణలకు సంబంధించిన కేసులో చిరంజీవి నాగ్‌ను ఏ5 (5వ నిందితుడు)గా చేర్చారు. ఈ క్రమంలో సోమవారం ఆయన కోర్టు ఎదుట హాజరయ్యారు. విచారణ సమయంలో, తన ఆరోగ్య పరిస్థితిని చిరంజీవి నాగ్ కోర్టుకు వివరించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అనంతరం, ఈ నెల 10వ తేదీన జరిగే తదుపరి విచారణకు తపనిసరిగా హాజరు కావాలని చిరంజీవి నాగ్‌ను కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో చిరంజీవి నాగ్ తండ్రి తమ్మినేని సీతారాం ఏ6 (6వ నిందితుడు)గా, ఆయన తల్లి వాణిశ్రీ ఏ7 (7వ నిందితురాలు)గా ఉన్నారు. ఒకే కేసులో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ముగ్గురూ నిందితులుగా ఉండటం గమనార్హం.



# “ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?”..

మొదటి పేజీ రువాయి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ‘యూత్ డిక్లరేషన్’ పేరిట కాంగ్రెస్ నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని విమర్శించారు. ఉద్యోగాలు రాక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరుద్యోగులు అడిగితే సీఎం రేవంత్ రెడ్డి “ఎండ్రిన్ తాగి చావండి” అన్నట్లుగా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను ‘క్రిమినల్ వేస్ట్’ అని సీఎం రేవంత్ సంబోధించడం బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపిస్తూ “అసలైన క్రిమినల్ వేస్ట్ ఆయనే” అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతితో తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణ నిరుద్యోగుల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్హతపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఆయన అసలు ఏం చదివారో కూడా అనుమానమేనని అన్నారు. ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్‌ను నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూకైనా హాజరయ్యారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల కష్టాలు రేవంత్‌కు ఏమాత్రం తెలియవని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా, కేంద్ర నిధుల కొరత ఉన్నా రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తుందో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# నిమ్స్ మరో రికార్డు

మొదటి పేజీ రువాయి

భవిష్యత్తులో మరింత ఆధునిక వైద్యసేవలను ప్రజలకు అందిస్తూ కొత్త మైలురాళ్లు చేరుకోవడానికి నిమ్స్ కృషి చేస్తుందని తెలిపారు.

**ముఖ్యమంత్రి అభినందనలు**

నిమ్స్ లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళు సాధించాలని సీఎం ఆకాంక్షించారు

# “మిస్టర్ డ్రామారావు”

మొదటి పేజీ రువాయి

తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ‘ఎక్స్’ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న ‘మిస్టర్ డ్రామారావు’ కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.



# ఎన్నికల రాజకీయాల్లోకి కాక్రోచ్ పార్టీ?

మొదటి పేజీ రువాయి

ఉన్నారని, ఇప్పుడు వాలంటీర్ల సంఖ్య 300 దాటిందని తెలిపారు. ముందుగా వారందరితో సమావేశమై ఉద్యమంలో జరిగిన లోపాలు, మెరుగుపర్చాల్సిన అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. ఆ తర్వాతే సంస్థ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే తమ ఉద్యమం అతిపెద్ద విజయం కాదని దీప్కే స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో పెరగడం, తమ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చి పోరాడే స్ఫూర్తి రావడమే నిజమైన విజయమని అన్నారు. గత 10 నుంచి 12 ఏళ్లుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పోలీసు చర్యలు, కేసులు, జైలు భయం ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపిస్తే ప్రభుత్వం స్పందించాలని దీప్కే అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని కోరినప్పుడు ఆ డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడినప్పుడు ప్రజా ఒత్తిడి తీసుకొచ్చే ఉద్యమాలే అవసరమని చెప్పారు. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలంలో కూడా ప్రజా ఉద్యమాలే కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. నిరుద్యోగం, విద్య వంటి అంశాలు కూడా రాజకీయ నిర్ణయాలతో ముడిపడి ఉంటాయని దీప్కే అన్నారు. పార్లమెంట్‌లో తీసుకునే నిర్ణయాల ప్రభావం ప్రజలు కొనుగోలు చేసే నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ విద్యకు సంబంధించిన సమస్య తలెత్తినా తమ సంస్థ విద్యార్థులకు అండగా ఉంటుందని దీప్కే చెప్పారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థ సవాళ్లు ఎదుర్కొంటోందని, విద్యార్థుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. అలాంటి ప్రతి సమస్యపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

మొదటి పేజీ రువాయి

రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశు గ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

మొదటి పేజీ రువాయి

**ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు: దామోదర**

నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రొబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి దామోదర అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పూర్తి చేసిందని వెల్లడించారు. దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్ చేసిందని మంత్రి దామోదర చెప్పుకొచ్చారు. 90 శాతానికి పైగా రొబోటిక్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితమని తెలిపారు. యూరాలజీలో 590, గ్యాస్ట్రోలో 248, ఆంకాలజీలో 162 రొబోటిక్ సర్జరీలు జరుగుతాయని వివరించారు. ఎంఎన్‌జేలోనూ విజయవంతంగా రొబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కొత్త టిమ్స్, గాంధీ, ఉస్మానియాలో రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.



# ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలి

**మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, నరసింహులపేట :** నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) మరియు ముఖ్య నాయకుల ఎస్ఐఆర్ ఓటరు సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డోర్నకల్ శాసనసభ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి దిశానిర్దేశం చేస్తూ ప్రసంగించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ



(ఎస్ఐఆర్) ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు. కొత్త ఓట్ల నమోదు, జాబితాలోని తప్పుల సవరణ, చిరునామాల మార్పులు – చేర్పులు వంటి అంశాలపై బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏ) పలు కీలక సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మైదం దేవేందర్, సీనియర్ నాయకులు నెలకుర్తి నరసింహారెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గుగులోతు రవి, నాయకులు జగదీష్, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఎల్ఏలు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు ఆలయాల బోనాల పండగకు ప్రభుత్వ సహాయ నిధులు

**వివిధ ఆలయాల ప్రతినిధులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**ఆగస్టు 03, మారేడ్‌పల్లి,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా కంటోన్మెంట్ నియోజక వర్గ పరిధిలోని పలు ఆలయాలకు ప్రభుత్వ సహాయ చెక్కులను అందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్. బోనాల పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం మారేడ్‌పల్లిలోని మల్టీ పర్పస్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, వివిధ ఆలయాల ప్రతినిధులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను భక్తులు అత్యంత వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆలయాలకు ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే నియోజకవర్గ పరిధిలోని దాదాపు 270 దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఉత్సవాల నిర్వహణలో ఆలయ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోందని, భక్తులకు మౌలిక వసతులు, భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మన ఆచార వ్యవహారాలను, పండుగలను ఘనంగా నిర్వహించుకోవడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



ఎమ్మెల్యే శ్రీగణేష్, బోయిన్పల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆనంద్ బాబు, వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు దేవాదాయ శాఖ సికింద్రాబాద్ ఇన్స్పెక్టర్ ఆండాళ్లు. ఈవోలు సత్యనారాయణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

# విశ్వవిద్యాలయంలో తొలి మహిళా రిజిస్ట్రార్‌ను కొనసాగించాలి

**లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో ఉద్యమం- చల్ల రామకృష్ణ రెడ్డి**

**ఆగస్టు 03, కూకట్పల్లి,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** జె.ఎన్.టి.యు.హెచ్ లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో విశ్వవిద్యాలయ విద్యార్థులుగా, విద్యార్థి నాయకులుగా మా అభిప్రాయాన్ని మీడియా ద్వారా ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ మరియు ప్రజలకు తెలియజేయాలనుకుంటున్నాము.జె.ఎన్.టి.యు.హెచ్ పీహెచ్డీ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ గత రిజిస్ట్రార్‌గా రెండు సంవత్సరాల నాలుగు నెలల పాటు విధులు నిర్వహించిన ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావుని రిలీవ్ చేస్తూ, 2026 జూన్ 12వ తేదీన వైస్ ఛాన్సలర్ ఆచార్య డా. టి. కిషన్ కుమార్ రెడ్డి డాక్టర్ ఏ. జయలక్ష్మి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు.54 సంవత్సరాల జె.ఎన్.టి.యు.హెచ్ చరిత్రలో తొలిసారిగా ఒక మహిళ, అదీ బీసీ వర్గానికి చెందిన మహిళ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించడం విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం.బాధ్యతలు చేపట్టి కేవలం 50 రోజులే అయిన ఒక అధికారికి తన విధులను స్వేచ్ఛగా నిర్వర్తించే అవకాశం ఇవ్వకుండా వివిధ రకాల ఒత్తిళ్లు తీసుకురావడం సమంజసం కాదు. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జె.ఎన్.టి.యు.హెచ్లో పరిపాలనా స్థిరత్వం ఎంతో అవసరం.ఉమెన్ ఎంపావర్మెంట్ గురించి మాట్లాడే ప్రతి ఒక్కరూ, దానిని ఆచరణలో కూడా చూపించాలి. తొలి మహిళా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఏ.జయలక్ష్మి కి పూర్తి స్థాయిలో పనిచేసే అవకాశం కల్పించాలి. విశ్వవిద్యాలయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆమెను రిజిస్ట్రార్‌గా కొనసాగించాలని మేము ప్రభుత్వాన్ని మరియు ఉన్నతాధికారులను కోరుతున్నాము.అదేవిధంగా, జె.ఎన్.టి.యు.హెచ్ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ, విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా ప్రమాణాల కోసం చట్టబద్ధంగా పనిచేస్తున్న వైస్ ఛాన్సలర్ ఆచార్య డా. టి.కిషన్ కుమార్ రెడ్డి పై ఎలాంటి అనవసర ఒత్తిళ్లు తీసుకురావద్దని విజ్ఞప్తి చేస్తున్నాము.పీహెచ్డీ స్కాలంఓ పితాని సందీప్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిపాలనలో రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాలకు తావు లేకుండా విద్యార్థుల భవిష్యత్తు మరియు విశ్వవిద్యాలయ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా




నిర్ణయాలు తీసుకోవాలి. డాక్టర్ ఏ. జయలక్ష్మిని రిజిస్ట్రార్‌గా కొనసాగించకుండా, విశ్వవిద్యాలయ పరిపాలనలో అనవసర జోక్యాలు కొనసాగితే, జె.ఎన్.టి.యు.హెచ్లోని అన్ని విద్యార్థి సంఘాలు ఏకమై, వేలాది మంది విశ్వవిద్యాలయ విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరిస్తున్నాము. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో జయరాం, సాయిరాం, మనీష్, కారుణ్య, రామ్, ఉదయ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గుండాల మండలం పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. జిల్లాలో పీఏసీఎస్ బ్యాంకుల ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం కోసం మొత్తం 104 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం లేకుండా ఏ మండలంలో పండిన ధాన్యం అదే మండలంలో భద్రపరిచే విధంగా గోదాములను నిర్మించనున్నామని తెలిపారు. దీనివల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా ధాన్యం నాణ్యత కూడా పరిరక్షించబడుతుందని పేర్కొన్నారు.అందులో భాగంగా గుండాల మండలంలో నాలుగు ఎకరాల భూమిని గోదాముల నిర్మాణం కోసం కేటాయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ధాన్యం ఉత్పత్తి మరింత పెరుగుతుందనే అంచనాలతో ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఈ గోదాముల నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని



పేర్కొన్న ఆయన, రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి మూడు రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేసే విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.అలాగే గంధమల్ల నుంచి బీక్కేరు వాగు వైపు నీటిని విడుదల చేయడం ద్వారా సాగునీటి లభ్యత పెరిగి రైతులకు అధిక దిగుబడులు వచ్చాయని తెలిపారు.సాగునీటి వనరులను మరింత బలోపేతం చేసి వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గుండాల మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో గుండాల మండల కేంద్రంలో మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం విగ్రహాన్ని పెట్టే దిశగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ ని సూచనలు చేశారు.ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి మాట్లాడుతూ, ఆగస్టు 15 నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ఎక్కడ నిర్మాణాలు నిలిచిపోయాయో కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.గ్రామాల్లోని సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల నాయకులు సమన్వయంతో పనిచేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హత గల కుటుంబానికి గృహ కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



# కంటోన్మెంట్ బోర్డు సీఈవోతో సమావేశమైన ఎమ్మెల్యే

**బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా**



**ఆగస్టు 03, సికింద్రాబాద్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో ఆషాడ మాస బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సీఈవో అరవింద్ కుమార్ ద్వివేదీని కోరారు. ఆషాడ బోనాల సందర్భంగా కంటోన్మెంట్లోని ఆలయాల వద్ద దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ ఉప్పొంగే అవకాశాలు కాకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉత్సవాలు జరిగే వీధుల్లో సరిపడా విద్యుత్ దీపాలు ఉండేలా చూడాలని కోరారు. బోనాల పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా కంటోన్మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సీఈవో ని కోరడం జరిగింది. స్పందించిన సీఈవో అరవింద్ కుమార్ ద్వివేదీ, తక్షణమే క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# శ్రీ ఉజ్జయిని మహంకాళి జాతరలో పారిశుధ్య అధికారులు

**సికింద్రాబాద్ సర్కిల్ -3 బోయిన్పల్లి వివిధ విభాగాల అధికారుల విధి నిర్వహణ**

**ఆగస్టు 03, రాణిగంజ్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర పండగ సికింద్రాబాద్లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారి ఆషాడ మాస బోనాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో మురుగునీరు, వ్యర్థాల నిర్వహణ మరియు పరిసరాల శుభ్రత, పరిశు



భ్రత వ్యక్తిగత లేదా సాధారణ స్వచ్ఛత, శుచి శౌచ పవిత్రత మరియు శుభ్రంగా ఉండే స్థితిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు మేడ్చల్ మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని సికింద్రాబాద్ సర్కిల్ -3 బోయిన్పల్లి విభాగం పలు పారిశుధ్య కార్యకలాపాలలో మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాల ప్రధాన అధికారి వేణు, ఫ్లీట్ విభాగం అధికారి అమానుల్లాహ్ ఖాన్, జోనల్ ముఖ్య అధికారి బాల, సర్కిల్ ఇంచార్జ్ విభాగం బి.అరుణ,వార్డు ఫీల్డ్ అసిస్టెంట్స్ విభాగం శివా కుమార్, సుధాకర్ పాల్గొని ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు, ప్రజలకు శుభ్రత విషయంలో గట్టి చర్యలు చేపట్టారు. అన్ని విభాగాల అధికారులతో సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

# "ఫ్రేంవర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్" యాప్ ద్వారనే ఎరువులు కొనుగోలు చెయ్యాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, సిద్దిపేట జిల్లా:**



వర్గల్ మండలంలో రైతులందరూ 06.08.2026 నుండి "ఫ్రేంవర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్" (ఎఫ్.ఎఫ్.ఎస్) యాప్ ద్వారనే యూరియా, డిఎపి, ఎంఓపి, కాంప్లెక్స్ ఎరువులు మొదలైనవి కొనుగోలు జరుగుతుంధి అని శేషశయన, మండల వ్యవసాయ అధికారి, వర్గల్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఎరువుల దుర్వినియోగం, ఎరువుల పక్కాధారి పట్టడం మొదలైనవి అరికట్టవచ్చని తెలిపారు. ఎరువుల బుకింగ్ కోసం ఆధార్ మరియు రైతు రిజిస్ట్రీ ఐడి సంఖ్య, ఆధార్ అనుసంధానిత మొబైల్ నంబర్, తప్పనిసరిగ అందుబాటులో ఉంచుకోవలాని తెలిపారు.మండలంలో డీలర్లు అందరికి సోమవారం మధ్యాహ్నం శిక్షణ గౌరారం రైతువేదికలో ఇవ్వడశీ జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏఈఓలూ సునీత, అనిత, భారతి, మౌనిక, వినీత, మరియు డీలర్లు బాలరాజు, జహంగీర్, అశోక్ మొదలైనవారు హాజరయ్యారు.



# నల్లవాగు ప్రాజెక్టు నీటిని వెంటనే విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే

**మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 03, నారాయణ ఖేడ్ :**
సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టులో నీటిమట్టం 89 లెవెల్‌కు చేరుకున్నప్పటికీ ఇప్పటి వరకు సాగునీటిని విడుదల చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నల్లవాగు ప్రాజెక్టు కింద ఉన్న వేలాది ఎకరాల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు ఉన్నప్పటికీ విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమన్నారు.ఈ విషయమై సంబంధిత డీఈ అధికారితో ఫోన్‌లో మాట్లాడి, ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే సాగునీటినివిడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. అధికారులు కూడా రైతుల సమస్యలను అత్యవసరంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, స్థానిక ఎమ్మెల్యేకు సాగునీటి అవసరాలపై సరైన అవగాహన, చొరవ లేకపోవడంతోనే నీటి విడుదల ఆలస్యం అవుతోందని భూపాల్ రెడ్డి విమర్శించారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు."నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించాం. రైతులు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసేవాళ్లం. కానీ నేడు నీరు అందుబాటులో ఉన్నా విడుదల చేయక రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు.ఎరువుల విషయంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత నెలకొన్నప్పటికీ రైతులకు సకాలంలో అందించే చర్యలు తీసుకోవడం లేదన్నారు. యూరియా కోసం రైతులు షాపుల చుట్టూ తిరుగుతున్నారని, "షాపుల్లో లేని యూరియా యాప్‌లలో దొరుకుతుందా?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఉన్నవారిలో కూడా యాప్‌ల వినియోగంపై అవగాహన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకోవాల్సి రావడంతో రవాణా ఖర్చు కూడా రైతులపై అదనపు భారంగా మారిందన్నారు.అందువల్ల యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా, ప్రతి గ్రామానికి సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) మరియు ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత యూరియాను నిల్వ ఉంచి రైతులకు సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై స్పందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా రాజకీయాలను పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే



నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయడంతో పాటు ఎరువుల కొరతను నివారించాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.గతమా ప్రభుత్వంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు అందించామని వారికి ఇబ్బందులు లేకుండా చూసుకుందామని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 12 గంటలు కూడా సరిగా రావడం లేదని నాణ్యమైన కరెంటు లేక మోటార్ కాళీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి సకాలంలో నాణ్యమైన విద్యుత్ 24 గంటలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ మీడియా సమావేశంలో మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్, సర్పంచులు మారుతి, సంగన్న, పి.ఎ.సి.యస్ చైర్మన్ కృష్ణ గౌడ్ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, మాజీ సర్పంచులు పండరి, గోపాల్ రెడ్డి, సాయ గౌడ్, నారాయణ, మాజీ ఎంపీటీసీలు కృష్ణ గౌడ్, మాజీ ఉపసర్పంచ్లు భూషణం, సాయిలు, పార్టీ సీనియర్ నాయకులు కిషన్ రెడ్డి, నారాయణ, జనార్ధన్ సార్, వీరేశంసెట్, పండరి, మహబూబ్, కాజా, ప్రశాంత్ సాగర్, ప్రమోద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వాలు మారినా ప్రధాన సమస్య తీరునా..!

**ఏండ్లు గడుస్తున్నా సమస్య తీవ్రం, నేతల తీరుపై ప్రజాగ్రహం.**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరిన ప్రజలు.**

**ఆగష్టు 03, రాంరెడ్డి కాలనీ, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధా? నూతన మేడ్చల్ మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధా? అన్న అయోమయంలో ఓల్డ్ బోయిన్పల్లి, న్యూ బోయిన్ పల్లి ప్రాంత,రాంరెడ్డి కాలనీ వాసులు, ప్రజలు ఉన్నారు. ముఖ్యంగా చెప్పాలంటే ఓల్డ్ బోయిన్పల్లి చౌరస్తా నుండి బాపూజీ నగర్ ప్రధాన రహదారిలో వర్షపు నీరు ప్రవాహం ప్రమాదకరంగా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా శ్రీ చైతన్య స్కూల్ నుండి సి.ఎం.ఆర్ స్కూల్ మధ్యలో అరగంట వర్షానికి సముద్రంలా తలపించే వర్షపు నీటి ప్రవాహం వల్ల తీవ్ర అవస్థలు పడుతున్న సామాన్య ప్రజలు, స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు, వర్తక వ్యాపారులు, వాహనదారులు. గత కొన్ని ఏండ్ల నుండి రాంరెడ్డి కాలనీ ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే భయపడుతు బ్రతుకుతున్నారు. వర్షపు నీరు మిలిటరీ డైరీ ఫారం రోడ్డు గుండా కళింగ ఎంక్లేవ్ మీదుగా అలీ కాంప్లెక్స్ వరకు ప్రవహించి రాంరెడ్డి కాలనీలోకి ప్రవేశించడం వల్ల పలు కాలనీలలో రోడ్లపైకి చేరుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిలో శ్రీ పోచమ్మ అమ్మ వారికీ దేవాలయం ఉండడం, ఈ వర్షపు నీటి ప్రవాహం వల్ల రాబోయే ఆషాడ మాస బోనాల పండగకు ఇబ్బందుల వల్ల భక్తులు రాలేని పరిస్థితులు వస్తాయని అగ్రహిస్తున్నారు. గతంలో ఈ రాంరెడ్డి కాలనీ వాసులు,




ప్రజలు కంటోన్మెంట్ బోర్డ్, గ్రేటర్ హైదరాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యులకు, మున్సిపల్ అధికారులకు, నియోజక వర్గ ఎమ్మెల్యేలకు ఈ ప్రధాన సమస్యను పలుమార్లు విన్నవించుకున్న, వినతి పత్రాలు ఇచ్చిన పరిష్కరించకపోవడం సమస్య ఇంకా తీవ్ర స్థాయిలో ప్రజల ఆగ్రహానికి, గురి అవుతున్నారు. ప్రజా సమస్యలే పరమావధిగా నిలిచే హైదరాబాద్ పల్స్ న్యూస్ లో గతంలో రెండు సార్లు ఈ సమస్యపై పలుమార్లు ప్రత్యేక కథనాన్ని ప్రచురించాము. ప్రజలకు కంటోన్మెంట్ బోర్డు పరిధా లేక నూతన మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధా అనే సందిగ్ధంలో ఉండడం వల్ల సమస్య పరిష్కారం దిశగా ముందుకు సాగడం లేదు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఈ ప్రధాన రహదారిలో మోకాలు లోతు నీరు నిల్వ ఉండడం, వాహనాలు భారీ నీటి ప్రవాహంలో ప్రయాణం వల్ల చెడిపోతున్నాయని, కాలినడకన నడిచే ప్రజలు ముఖ్యంగా పలు స్కూల్స్ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుండి ఉన్న ఈ ప్రధాన నీటి నిల్వ సమస్యపై చుట్టుపక్కల ఉన్నటువంటి కార్పొరేట్ స్కూల్ యాజమాన్యాలు స్పందించకపోవడం కొంత విడ్డూరంగా ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా కంటోన్మెంట్ బోర్డ్ లేదా మేడ్చల్ మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధి ప్రజా ప్రతినిధులు, నేతలు, రాంరెడ్డి కాలనీ వార్డు కౌన్సిలర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మాద మల్లికార్జున్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు, మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, మున్సిపల్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు, స్కూల్ యాజమాన్యాలు వెంటనే స్పందించి యుద్ధ ప్రతిపాదికన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కింద భారీ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలనీ భవిష్యత్లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని హైదరాబాద్ పల్స్ పత్రిక ద్వారా కోరుతున్నారు.

# గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, మందుల లభ్యత, అత్యవసర వైద్య సేవలు, ఆసుపత్రిలో ఉన్న వసతులపై సమగ్రంగా ఆరా తీశారు.ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వాటి కాలపరిమితి, అవసరమైన అన్ని రకాల మందులు సరిపడా ఉన్నాయా లేదా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. అలాగే కొరత ఉన్న వైద్య, పారామెడికల్ సిబ్బంది వివరాలను సేకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా 108 అంబులెన్స్ సేవల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో




స్పందన సమయం, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంబులెన్స్ సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్వో)తో ఫోన్‌లో మాట్లాడిన బీర్ల ఐలయ్య, ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది కొరత, మందుల లభ్యత, గడువు ముగిసే మందుల పరిస్థితి, 108 అంబులెన్స్ సేవలు తదితర అంశాలపై పూర్తి నివేదికను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు.ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో చికిత్స అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



# రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 15000 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చెయ్యాలి

## భారతీయ జనతా యువ మోర్చా నారాయణఖేడ్ శాఖ (బీజేవైఎం) డిమాండ్.



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 03, నారాయణ ఖేడ్ :**
తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసి, సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని భారతీయ జనతా యువ మోర్చా నారాయణఖేడ్ శాఖ (బీజేవైఎం) డిమాండ్ చేసింది.రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడం వల్ల విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక కళాశాలలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లగా, విద్యార్థులపై ఫీజుల భారం పెరిగింది.ఈ నేపథ్యంలో "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చ కన్వీనర్ పట్నం మాణిక్, సాయి పటేల్ సగుణకర్ లోకేశ్ పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో పాలకవర్గం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :చర్ల** మండలం, మొగళ్ళపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచడమే లక్ష్యంగా సర్పంచ్ కుప్ప సత్యవతి,ఉప సర్పంచ్ రామదాసు, పంచాయతీ సెక్రటరీ బి.నవీన్ ప్రజలకు అందుబాటు లో ఉండి గ్రామంలో పారిశుద్ధ పనులను ప్రారంభించారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల సమయంలో గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ పాలకవర్గం తక్షణ చర్యలు చేపట్టింది. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా వీధులన్నింటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అంతేకాకుండా, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం గ్రామ వీధుల్లో నూతన ఎల్.ఇ.డి స్ట్రీట్ లైట్లను అమర్చారు. అనంతరం ఇతర అభివృద్ధి పనులను కూడా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీకి సకాలంలో నిధులు జమ కాకపోయినప్పటికీ, గ్రామ అభివృద్ధి పనులను ఎక్కడా ఆపకుండా ముందుకు తీసుకెళ్తామని మాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయం" అని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గ్రామ రూపురేఖలు మార్చడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# కొంపల్లి మున్సిపాలిటీలో పలు సమస్యలపై పోరాటం

**చర్యలు తీసుకోవాలని కమిషనర్ జి. శ్రీజనకు జెమ్మి దేవేందర్ వినతి**




కొంపల్లి, ఆగస్టు 03, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : కొంపల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన,ఐఏఎస్‌ను కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు.జయభేరి పార్క్ కాలనీ,సెంట్రల్ పార్క్, అపర్ణతో పాటు పరిసర ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కొంపల్లి--దూలపల్లి ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారడంతో వాహనదారులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రహదారి విస్తరణ, మరమ్మతులు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి ప్రాంతంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ జి. శ్రీజన, ఐఏఎస్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసా..కన్నెగుండ్లలో చెక్కుల పంపిణీ



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మరో ఇద్దరు లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందింది. డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ ఆదేశాల మేరకు డోర్నకల్ మండలం కన్నెగుండ్ల గ్రామంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం బాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానపటి ఎర్రవెంకయ్యకు రూ.19,500, గడ్డం రమ్యకు రూ.26,500 విలువైన చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని, ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం రమ్య సంపత్, ఉప సర్పంచ్ బత్తుల స్వామి, వార్డు సభ్యులు బండారు రాణి మధు, జానపటి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తోట ముత్తయ్య, నిమ్మల సైదులు, తోట సతీష్, జానపటి ముతీష్, చిలక ప్రశాంత్, చిలక కార్తీక్, గడ్డం రవి, గడ్డం రామారావు, నర్ర వెంకన్న, జానపటి వీరభద్రం, కలకుంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కోసం వేగవంతమైన చర్యలు



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో పాత మంచినీటి పైప్‌లైన్‌ను తొలగించి, నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులను మున్సిపాలిటీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చేపట్టారు. పనులు వేగంగా పూర్తయ్యేలా మూడో వార్డు కౌన్సిలర్ వీరన్న స్వయంగా పనుల ప్రాంతాన్ని సందర్శించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాత్రి వేళల వరకు విశ్రాంతి లేకుండా విధులు నిర్వహిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది అంకితభావాన్ని కొనియాడుతూ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇలాంటి పనులు మరింత వేగంగా కొనసాగుతాయని కౌన్సిలర్ వీరన్న పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి, తాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని స్థానికులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

# రోడ్లు కాదు... మరణ మార్గాలుగా మారాయి..!

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి బీఎస్పీ హెచ్చరికతో కూడిన విజ్ఞప్తి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షులు అనుముల తుకారం మాట్లాడుతూ, ఎంజీ వక్కరేని, నాగలిగిద్ద, ఇరాక్‌పల్లి, శాఖాపూర్, సిర్గాపూర్ మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు.నారాయణఖేడ్ పట్టణంలోని ప్రధాన రహదారులు కూడా గుంతలమయంగా మారి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని, అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు సకాలంలో చేరలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.నియోజకవర్గ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వెంటనే స్పందించి, దెబ్బతిన్న అన్ని రహదారులను అత్యవసర ప్రాతిపదికన మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. “ప్రజల ప్రాణాలు ముఖ్యమా?లేక ప్రభుత్వ నిర్లక్ష్యమా? ఇకనైనా మేల్కొని వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టండి.



ప్రజల సహనాన్ని పరీక్షించవద్దు. రోడ్లు అభివృద్ధికి ప్రతీకలు కావాలి, మరణ మార్గాలు కాదు.” అని అనుముల తుకారం ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు. మలికి దొడ్డి పండరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలలు గడిచినా పురోగతి సాధించని జోగు సంగీత కేసు

**హత్యను సాధారణ మృతిగా చిత్రీకరించారనే ఆరోపణ.!**

**బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.**

**జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి: నవోదయ సిద్ధార్థ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, నారాయణఖేడ్ :** జోగు సంగీత హత్య కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం కంగ్టి మండలం దెగులువాడి గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. జోగు సంగీత హత్య జరిగినప్పటికీ కేసు నమోదులో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రతిసారి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ.. బాధిత కుటుంబం హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో వారి





వినతిపై దెగులువాడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. జోగు సంగీత భర్త జోగు విజయ్ మే 27న ఆమె కనిపించడం లేదని కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని ఆయన ఆరోపించారు. అనంతరం మే 29న గ్రామ శివారులో జోగు సంగీత (26) మృతదేహం ఎడమ చేయి లేకుండా లభించిందని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ ఆ నివేదికను కుటుంబ సభ్యులకు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు.రెండు నెలలు గడిచినా కేసులో గణనీయమైన పురోగతి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, బాధిత కుటుంబం న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే వారిని భయపెట్టడం బాధాకరమని విమర్శించారు. చట్టం అందరికీ సమానమని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ సంస్థ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం





జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.చివరగా జోగు సంగీత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నవోదయ సిద్ధార్థ నేతృత్వంలోని బృందం కంగ్టి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై దుర్గారెడ్డిని కలిసి జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి, నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఓంప్రకాష్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్, సంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గాల్‌రెడ్డి, డాక్టర్ బాబురావు, సాయిలు, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. ఖైసర్, సంతోష్‌రావు పాటిల్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బహుజన ప్రసాద్, కుత్బుల్లాపూర్ మండలం ఉపాధ్యక్షులు సాయి, సంస్థ నాయకులు సురేష్ గౌడ్, గ్రామస్తులు విశ్వనాథ్, శంకర్, భీమప్ప ప్రకాష్ , బాధితులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గల్ క్షేత్రంలో... ముగిసిన వరుణ యాగం

**శ్రీ చంద్రమౌళీశ్వర స్వామికి జలాభిషేకం చేసిన సిద్ధాంతి చంద్రశేఖర శర్మ**

**పది రోజులపాటు క్షేత్రంలో వైభవంగా మహా రుద్రాభిషేకం**


**లోక కళ్యాణార్థమే ఈ మహత్కార్యం**

**ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, సిద్దిపేట జిల్లా :** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి కరుణించాలని కాంక్షిస్తూ ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వరుణ యాగం వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థమై నిర్వహించిన ఈ మహా రుద్రాభిషేకంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, గురువులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా పది రోజుల పాటు ఘనంగా జరిగిన ఈ మహత్కార్యం సత్ఫలితాలు ఇవ్వాలని కాంక్షిస్తూ శ్రీ చంద్రమౌళీశ్వర



స్వామివారికి సోమవారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడాలని కాంక్షిస్తూ యజ్ఞ యాగాదులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ముఖ్యంగా వేద పండితులు నిర్వహించే విశేష వైదిక క్రతువు వరుణ యాగంతో ప్రకృతి కనికరిస్తుందని, పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని స్పష్టం చేశారు. మూల మంత్ర హోమము, ప్రత్యేక కలశ పూజలు, మహా రుద్రాభిషేకం తదితర నిర్వహించగా, శ్రీ పరమేశ్వరుడి



కృప కోసం ప్రతినిత్యం ఆలయ సముదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. అయితే రైతులు సుభిక్షంగా పంటలు పండించాలని తమ లక్ష్యం కాగా, ఆ దిశగా క్షేత్రంలో ఈ పుణ్యకార్యం నిర్వహించినట్లు సిద్ధాంతి చంద్రశేఖర శర్మ వివరించారు.

# మాజీ మంత్రి స్వర్గీయ ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** స్వర్గీయ మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి వర్ధంతి సందర్భంగా గుండాల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, స్వర్గీయ మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. రానున్న రోజులలో గుండాల మండల కేంద్రంలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జీవితాంతం సేవలందించిన పురుషోత్తం రెడ్డి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారి సేవలు, త్యాగాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అనంతరం అక్కడున్న నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా



నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మల్లయ్యకుంట తండా అభివృద్ధికి సర్పంచ్ సుమ సురేష్ నాయక్ ప్రత్యేక చొరవ

**గ్రామాభివృద్ధే లక్ష్యంగా వరుస సంక్షేమ, మౌలిక సదుపాయాల పనులు**

**ప్రజల భాగస్వామ్యంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం మల్లయ్యకుంట తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ తేజావత్ సుమ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామంలో కొత్త సిమెంట్ రహదారుల నిర్మాణంతో పాటు ఇప్పటికే పూర్తయిన రహదారులను పరిశీలించారు. పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం, ప్రతి వీధిలో పరిశుభ్రత, చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రైతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పంట కుంటల ఏర్పాటు, గ్రామ కుంట అభివృద్ధి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన, ఉపాధి కూలీలకు ఎక్కువ రోజుల పని కల్పించేలా ఇంకుడు గుంటల నిర్మాణం, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయడం, దోమల నివారణకు మందు పిచికారీ చేపట్టడం, గ్రామాన్ని ఆరోగ్యవంతమైన వాతావరణంతో ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధిని మరింత




వేగవంతం చేస్తామని సర్పంచ్ తేజావత్ సుమ సురేష్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోతు విజయ వెంకన్న, వార్డు సభ్యులు తేజావత్ లక్షపతి, భూక్యా కిషన్, బానోతు స్వాతి సాయి కృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి బానోతు శ్రీధర్, వ్యవసాయ విస్తరణ అధికారి అవినాష్, బానోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దంతాలపల్లి ఎస్సై పై ఎస్పీకి చరవాణిలో ఫిర్యాదు..!




**దంతలపల్లి, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03 :**
దంతాలపల్లి మండలం దొనకొండ గ్రామంలో అంగన్వాడి ని టీచర్ ఆవుల మంజుల, హెల్పర్ వెంకటలక్ష్మి అంగన్వాడి సెంటర్ పనిచేస్తున్న సమయంలో మహిళలమైన మమ్ములను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై దంతాలపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దంతలపెల్లి ఎస్సై రవి కుమార్ మహిళలని కూడా చూడకుండా దుర్భాషలాడుతూ నిలబెట్టి అవమానపరుస్తూ పోలీస్ స్టేషన్ ఆయన చాంబర్ మమ్మల్ని మా భర్తలని నానా బూతులు చిట్టి అవమానపరిచిన విషయంపై సంబంధిత జిల్లా ఎస్పీ కార్యాలయానికి చరవాణి ద్వారా ఫిర్యాదు చేయడం అనంతరం తొర్రూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్ కు పిటిషన్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మమ్మల్ని వేధించిన వ్యక్తిపై కేసు పెట్టమని అడిగితే మీపై మీ భర్తలపై కేసు పెడతానని మీరేమన్నంత సుఖమా అని అనుచిత వ్యాఖ్యలు అవమానపరిచి మహిళలమైన మమ్ములను అవమానపరిచిన, మా భర్తను తొక్కి చంపుతానంటూ బహిరంగ అందరి ముందు అవమానపరిచి మా మనోభావాలు దెబ్బతీసిన ఎస్సై సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యమని వారు తెలియజేశారు.

# కన్నీటి వేళ అండగా కాంగ్రెస్..నిరుపేద కుటుంబానికి భరోసా ఇచ్చిన కన్నెగుండ్ల గ్రామ ప్రజాప్రతినిధులు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం కన్నెగుండ్ల గ్రామానికి చెందిన నిరుపేద ఆటో డ్రైవర్ బండారు వెంకన్న అనారోగ్యంతో చికిత్స పొందుతూ జూలై 25న సంకల్ప ఆసుపత్రిలో మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వెంకన్న మరణం ఆ ఇంటిని శోకసంద్రంలోకి నెట్టగా, ఆసుపత్రి చికిత్స బిల్లుగా రూ.60 వేల మొత్తాన్ని చెల్లించిన తర్వాతే మృతదేహాన్ని అప్పగిస్తామని యాజమాన్యం తెలిపినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కన్నెగుండ్ల గ్రామ సర్పంచ్ గడ్డం రమ్య, ఉపసర్పంచ్



బత్తుల స్వామి వెంటనే స్పందించి, డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే జోక్యంతో ఆసుపత్రి యాజమాన్యం బిల్లు చెల్లించకుండానే వెంకన్న భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించింది. అంతేకాకుండా, దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి సర్పంచ్ గడ్డం రమ్య, ఉపసర్పంచ్ బత్తుల స్వామి తమ వంతు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలవడమే ప్రజాసేవ అని మరోసారి నిరూపించారని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం బాబు, తోట ముత్తయ్య, వార్డు సభ్యులు జానపటి అంజయ్య, బండారు రాణి, కాంగ్రెస్ కార్యకర్తలు చిలక కార్తీక్, గడ్డం రవి, గడ్డం రామారావు, నిమ్మల సైదులు, నర్ర వెంకన్న, జానపటి ముతీష్, కలకుంటి వెంకన్న, తీగల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పని వేళల్లోనే అంగన్వాడి కేంద్రానికి తాళం.. అధికారుల -పర్యవేక్షణ ఎక్కడ..?

**చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందని సేవలు**




**పెద్దవంగర, హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03:**
మండలంలోని ఓ అంగన్వాడి కేంద్రంలో విధి నిర్వహణ సమయంలోనే కేంద్రానికి తాళం వేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని వేళల్లో కేంద్రం తెరిచి ఉండి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాల్సి ఉండగా, కేంద్రం తరచూ మూసి ఉండటం స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కేంద్రం ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూసేస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రీ-స్కూల్ విద్య, పోషకాహార పంపిణీ, ఆరోగ్య సంబంధిత సేవలు సక్రమంగా అందడం లేదని వారు అంటున్నారు. బాధ్యత వహించాల్సిన సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారుతున్నాయని విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు సంబంధిత అధికారులు కేంద్రాన్ని తనిఖీ చేశారా? విధులకు గైర్హాజరవుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడి కేంద్రం తాళం వేసి ఉండడం వెనుక కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ ఏమైనా రెడ్ల అయ్య జాగీరా?

**సనత్ నగర్ టిమ్స్ కు మర్రి చెన్నారెడ్డి పేరేందుకు..?**

**తెలంగాణ ఉద్యమ ద్రోహి చెన్నారెడ్డి**

**టీమ్స్‌కు 'పండుగ సాయన్న' పేరు పెట్టాల్సిందే!**

**రేవంత్ రెడ్డే ఆఖరి ఓసీ సీఎం**

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, తెలంగాణ బ్యూరో** : హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ సంస్థలకు, ప్రాజెక్టులకు వరుసగా 'రెడ్ల' పేర్లు పెడుతుండటంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ సమాజంలో మెజారిటీగా ఉన్న బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.

రెడ్ల పేర్లకే ప్రాధాన్యమా?:
తెలంగాణలో ఏ ప్రాజెక్టు చూసినా, ఏ ఫ్లైఓవర్ చూసినా రెడ్ల పేర్లే కనిపిస్తున్నాయని మల్లన్న విమర్శించారు. ఎలిమినేటి మాధవరెడ్డి, జయపాల్ రెడ్డి, పి.జనార్ధన్ రెడ్డి, కాసు బ్రహ్మానంద రెడ్డి.. ఇలా ప్రతిదానికీ రెడ్ల పేర్లు పెట్టడానికి తెలంగాణ ఏమైనా వారి "అయ్య జాగీరా?" అని ప్రశ్నించారు.సనత్ నగర్ లో నిర్మిస్తున్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టీమ్స్)కు మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. టీమ్స్ నిర్మించడం కోసం తెచ్చిన అప్పులో బీసీల పేరు మీద 601 కోట్ల రూపాయలు ఉంటే, ఓసీల (రెడ్ల) పేరు మీద కేవలం 40 కోట్లు మాత్రమే ఉందని ఆయన పేర్కొన్నారు. "సొమ్మేమో బీసీలది.. సోకులేమో రెడ్లదా?" అంటూ నిలదీశారు.

తెలంగాణ ఉద్యమ ద్రోహులకు గౌరవమా?:
తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసిన వారి పేర్లు, రైతుల నోట్లో మట్టి కొట్టిన వారి పేర్లు సంస్థలకు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మర్రి చెన్నారెడ్డి, కొండా వెంకట రంగారెడ్డి వంటి వారు తెలంగాణ ద్రోహులని, పేదలకు భూములు దక్కకుండా చేసిన దొంగల పేర్లు ప్రాజెక్టులకు, రోడ్లకు, భావనలకు, విశ్వవిద్యాలయాలకు ఎలా పెడతారని మండిపడ్డారు.టిమ్స్ కు తెలంగాణ వీరులైన పండుగ సాయన్న లేదా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని మల్లన్న డిమాండ్ చేశారు. అలాగే జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెడతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ఎందుకు విస్మరించిందని, వెంటనే ఇచ్చిన మాట నిలబెట్టుకొని తమ చిత్త శుద్ధి నిరూపించుకోవాలని అన్నారు.రేవంత్ రెడ్డి తెలంగాణకు "ఆఖరి ఓసీ ముఖ్యమంత్రి" అని, 2028 తర్వాత రాష్ట్రంలో బీసీల ప్రభుత్వం వస్తుందని మల్లన్న జోస్యం చెప్పారు. బీసీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ రెడ్ల పేర్లన్నింటినీ తొలగిస్తామని, కేబీఆర్ పార్క్ ముందున్న కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని కూడా జేసీబీలతో పీకించి అవతల పారేస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల అనుసరిస్తున్న వివక్షను సహించేది లేదని, బీసీ మహనీయుల పేర్లు పెట్టే వరకు తమ పోరాటం ఆపబోమని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు.




# యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభం

**యాదాద్రి జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు**

**యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం**

**రాజీవ్ గాంధీ క్రికెట్ ట్రోఫీ పోటీలను ప్రారంభించిన చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి పట్టణంలో జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవల సందర్భంగా యాదాద్రి-భువనగిరి జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాల కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.వారోత్సవాల్లో భాగంగా మొదటి కార్యక్రమంగా "రాజీవ్ గాంధీ క్రికెట్ ట్రోఫీ" పోటీలను భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ ఆరోరా కాలేజీ గ్రౌండ్ లో ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ... రాజీవ్ గాంధీ యువతకు ఎంతో



ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువతను క్రీడల వైపు మళ్లించేందుకు ఈ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నాం అని అన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయి. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలి. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని అన్నారు.యువతలో ఐక్యతను, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్ తెలిపారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసి మెంబర్ తంగళ్లపల్లి రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ కుక్కదుగు సోమయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




# చిన్ననాటి స్నేహితురాలికి పూర్వ విధ్యార్థుల ఆర్థిక సహాయం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రేణికుంట గ్రామానికి చెందిన 1999 - 2000, బ్యాంచ్ 7వ తరగతి విధ్యార్థులు వారి చిన్ననాటి స్నేహితురాలు పాపగాని రమాదేవి భర్త గత నెలలో పొలం వద్ద పాము కాటుకు గరై చనిపోగా...వారు గోపాలాపురం గ్రామం తుర్కపల్లి మండలంలో ఉంటున్నారని తెలుసుకొని సోమవారం రోజు కలిసి పరామర్శించి మనోధైర్యాన్ని కలిగించి వారికి రూ,6000 నగదును రంగ నవీన్, రేగొండ పాండురంగం అందజేశారు.

# పేదల సంక్షేమమే లక్ష్యం.. బూరుగుపాడులో సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి పథకం మరో కుటుంబానికి ఆర్థిక భరోసాను అందించింది. డోర్నకల్ మండలం బూరుగుపాడు గ్రామంలో సోమవారం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును లబ్ధిదారుడు ఎల్లంపల్లి వెంకయ్యకు ఆయన నివాసంలో అందజేశారు. డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సంక్షేమ పాలనలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు దబ్బా శ్రీను ఆదివాసి, సోమనబోయిన నరసింహారావు, నల్ల సురేష్, నందిగామ గోపిరెడ్డి, చిట్టూరి రామయ్య, ఆదిమూల సైదులు, మద్ది రంగయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ములకలపల్లి గ్రామసభ



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామంలో సోమవారం డి.ఎస్. కళావతి జగదీష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొని గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి పారుదల సౌకర్యాల మెరుగుదల, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అధికారులు గ్రామస్థులతో విస్తృతంగా చర్చించారు. గ్రామ ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సమావేశం నిర్మాణాత్మక చర్చలతో విజయవంతంగా ముగిసింది.

# బేగంపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పెంట గోపాల్ ఏకగ్రీవం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం బేగంపేట గ్రామ పద్మశాలి సంఘం కమిటీని ఆదివారం రోజు పద్మశాలి సభ్యులు ఏకగ్రీవం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పెంట గోపాల్, ఉపాధ్యక్షుడిగా చెడదీపు వర్దేష్, జనరల్ సెక్రటరీగా చిన్నం బాలస్వామి, కోశధికారిగా బోగా కమలాకర్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం కమిటీ హాల్ నిర్మాణంతో పాటు ఈనెల 30న శ్రావణ మాస బోనాలు నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు భోగ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పెంట గోపాల్ మాట్లాడుతూ... బేగంపేట పద్మశాలి సంఘ భవనం నిర్మాణానికి కృషి చేస్తానని అలాగే బేగంపేట పద్మశాలి సంఘ సభ్యులకు అండగా ఉంటానని అన్నారు

# మల్కాజిగిరి నియోజకవర్గంలో 230 ఆలయాలకు రూ.76 లక్షల చెక్కులు పంపిణీ

## ఆలయ కమిటీల ప్రతినిధులకు 76 లక్షల చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గంలో బోనాల పండుగ సందర్భంగా దేవాలయాల అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంలో భాగంగా నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని 230 ఆలయాలకు రూ.76 లక్షల విలువైన చెక్కులను ఆలయ కమిటీల ప్రతినిధులకు అందజేశారు. బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు, దేవాలయాల్లో భక్తులకు మెరుగైన ఏర్పాట్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని అన్నారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి, ధార్మిక సంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ అధికారులు, మాజీ కార్పొరేటర్లు, ఆలయ కమిటీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, వివిధ రాజకీయ




పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

# కీసర శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కీసర మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కీసర శ్రీ రామలింగేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సోమవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం అందించారు. అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధిగా ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ అర్చకులు బీర్ల ఐలయ్యకి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపి భక్తులతో ఆప్యాయంగా పలకరించారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలు,



దేవాలయాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య



పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూనే, దైవానుగ్రహం కోసం తరచూ ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.

**తెలుసుకుందాం**

# వీరికి క్యాన్సర్ దూరం

**మూడు రకాల వ్యక్తులకు జీవితంలో క్యాన్సర్ సోకదని వైద్యులు నిర్ధారిస్తున్నారు. వాళ్లెవరంటే...**

**వ్యాయామం చేసేవాళ్లు:**
క్రమం తప్పకుండా చర్మం మీద చమట తాలూకు ఉప్పు చారికలు ఏర్పడేలా వ్యాయామం చేసే వాళ్లకు క్యాన్సర్ దరి చేరదని వైద్యులంటున్నారు. సానా, భౌతిక శ్రమ, వేడి ఈ మూడు పనులూ క్యాన్సర్‌ను దరి చేరనివ్వవు. మూత్రానికి బదులుగా చమటతో, క్యాడ్మియం, ఆర్సెనిక్, లెడ్ అనే క్యాన్సర్‌కారక లోహాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. ఏళ్ల తరబడి చమట పట్టే వీల్లేకుండా, ఎసిల్లో పని చేసే ఉద్యోగులకూ, వ్యాయామాలకు దూరంగా ఉండే వారికీ ఈ అవకాశం ఉండదు. కాబట్టి వీళ్లకు క్యాన్సర్ ముప్పు ఎక్కువ.

**ఆకలి పొట్ట కలిగినవాళ్లు:**
కాస్త ఆకలిగా రాత్రుళ్లు నిద్రకు ఉపక్రమించేవాళ్ల జోలికి క్యాన్సర్ రాదు. సాధారణ కణాలతో పోల్చితే క్యాన్సర్ కణాలకు దురాశ ఎక్కువ. నిరంతర గ్లూకోజ్ లేకుండా అవి బ్రతికి ఉండలేవు. రాత్రివేళ కడుపు ఖాళీగా ఉంటే, చక్కెర, ఇన్సులిన్ మోతాదులు పడిపోయి, ఆటోఫజీ ప్రేరేపితమవుతుంది. దాంతో కణాలు, దెబ్బతిన్న కణాలను, క్యాన్సర్ కారక చెత్తనూ జీర్ణించుకుంటాయి. 13 గంటల పాటు రాత్రి ఉపవాసాలున్న మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తిరగబెట్టే అవకాశాలు 36 శాతానికి పడిపోయినట్టు పరిశోధనల్లో రుజువైంది. బదులుగా రాత్రి 10 గంటలకు కడుపు నిండా తిన్నప్పుడు,



ఆకలితో అలమటించాల్సిన కణాలకు ఆహారం అందుతుంది.

**భావోద్వేగాలను బయల్పరిచేవారు:**
కోపమొస్తే అరిచేయడం, ఏడుపొస్తే ఏడ్చేయడం.... ఇలా భావోద్వేగాలను క్షణాల్లో బహిర్గతం చేసి తేలికపడే వాళ్లలో కార్టిసాల్ హార్మోన్ అదుపులో ఉంటుంది. బదులుగా వాటిని అణచిపెట్టే వాళ్లలో కార్టిసాల్ క్రమేపీ పెరుగుతూ, ప్రతి రోజూ కొత్తగా పుట్టుకొచ్చే కణితి కణాలను నాశనం చేసే సహజసిద్ధ కణాలు క్షీణించిపోతాయి.

# తల్లి పాలు తక్కువ కాకుండా...

బిడ్డకు తల్లిపాలు అమృత సమానం. కాబట్టి ఆ అమృతంలో కొరత రానివ్వకుండా, అందుకు అడ్డుపడే కారణాలను కూడా సకాలంలో సరిదిద్దుకోవాలి. అప్పుడే తల్లీ బిడ్డల ఆరోగ్యం నిక్షేపంగా ఉంటుందని అంటున్నారు వైద్యులు. పిల్లలకు ఇన్‌ఫెక్షన్లు సులభంగా సోకుతాయి కాబట్టి తల్లులు, బ్రెస్ట్‌ను శుభ్రంగా ఉంచుకోవడం కూడా ముఖ్యమే! అలాగని అందుకోసం ప్రత్యేక జాగ్రత్తలు పాటించవలసిన అవసరం లేకపోయినా, శుభ్రంగా స్నానం చేయడం తప్పనిసరి. అదనంగా క్రీములు, పౌడర్లు, పరిమళాలు వాడుకోవలసిన అవసరం లేదు. వాడుకోకూడదు కూడా! వీలైనంత వరకూ బ్రెస్ట్‌ను పొడిగా ఉంచుకోవాలి. బిడ్డకు పాలిచ్చే ముందు, కొన్ని పాలు తీసుకుని నిపుల్‌కు మర్దన చేయడం మంచిది. ఇలా చేయడం వల్ల చనుమొనలు పొడిబారిపోయి, చిట్లిపోకుండా ఉంటాయి.

బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల అవగాహన ముఖ్యం
బిడ్డకు పాలివ్వడం, సహజసిద్ధ చర్య అయినప్పటికీ, తల్లికీ బిడ్డకూ అసౌకర్యం కలగకుండా, బిడ్డ ఆకలి తీరేలా పాలిచ్చే పద్ధతుల గురించి గర్భిణిగా ఉన్నప్పటి నుంచే అవగాహన ఏర్పరుచుకోవాలి. అందుకోసం ప్రముఖ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండే లాక్టేషన్ కన్సల్టెంట్స్‌ను కలవొచ్చు. వీళ్లను కలవడం వల్ల, ప్రసవం తర్వాత, చనుమొనల్లో సమస్యలు, బిడ్డకు పాలివ్వడంలో ఇబ్బందులను ప్రారంభంలోనే కనిపెట్టి వాటిని సరిదిద్దుకునే వీలు కలుగుతుంది. కొందరికి రొమ్ము పరిమాణం బిడ్డ పాలు తాగడానికి అనుకూలంగా లేకపోవచ్చు, ఇంకొందరికి ఇన్వర్టెడ్ నిపుల్స్ ఉండొచ్చు. ఇంకొందరికి పాల గురించే పలు రకాల అనుమానాలు ఉండొచ్చు. కొలస్ట్రమ్: ప్రసవమైన వెంటనే పాలు ధారగా కారిపోవు. మొదట్లో ఒకట్రెండు రోజుల పాటు 'కొలస్ట్రమ్' అనే చుక్కల రూపంలో చిక్కని ద్రవం బయటకొస్తుంది. ఇది బిడ్డకెంతో విలువైనది. ఈ పాలను పిండి పారేయకుండా, తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలి. బిడ్డ పొజిషన్: పాలిచ్చే ముందు సౌకర్యవంతమైన ప్రదేశంలో, సౌకర్యవంతంగా కూర్చుని, ఆ తర్వాతే బిడ్డను ఒళ్లోకి తీసుకోవాలి. వెన్నుకు ఆసరా ఉండేలా చూసుకుని, కాస్త వెనక్కి వాలి బిడ్డకు పాలివ్వాలి.

రొమ్ముల్లో సమస్యలు
కొత్త తల్లుల్లో బిడ్డకు పాలిచ్చే పద్ధతులు, రొమ్ముల్లో తలెత్తే సమస్యల గురించిన అవగాహన ఉండదు. కానీ వీటి గురించి ముందే తెలుసుకుని ఉండడం మంచిది. చనుమొనలు చిట్లడం: బిడ్డ చనుమొనను మాత్రమే నోట్లోకి తీసుకుంటే సరిపోదు. చనుమొనతో పాటు చుట్టూరా ఉండే ఏరియోలాను నోట్లోకి తీసుకుని,



పాలు తాగేలా చూసుకోవాలి. చనుమొననే నోట్లోకి తీసుకుని పాలు తాగడం వల్ల దాని చుట్టూరా ఉన్న చర్మం చిట్లిపోయి, బిడ్డకు పాలివ్వడం ఇబ్బందికరంగా మారిపోతుంది. పాల గడ్డలు: రొమ్ములో పాలు నిల్వ ఉండిపోయి, గడ్డలు కట్టే పరిస్థితి ఇది. ఇలా నిల్వ ఉండిపోయు, గడ్డలు కట్టే వీల్లేకుండా, అదనంగా రొమ్ములో మిగిలిపోయిన పాలను ఎప్పటికప్పుడు పిండి, బిడ్డ కోసం నిల్వ చేసుకోవాలి. రొమ్ములో పాలు గడ్డలు కట్టినప్పుడు హాట్ కంప్రెషన్ వాడుకోవాలి. దాంతో గడ్డలు కొంతమేరకు కరుగుతాయి. గడ్డలు మరీ ఇబ్బందికరంగా మారినప్పుడు వైద్యులను కలవాలి. ఇలాంటి సందర్భాల్లో వైద్యులు, రొమ్ముల్లోని పాలు బయటకు వచ్చేయడానికి ప్రేరేపించే ఆక్సిటోసిన్‌ను వాసన చూపిస్తారు. ఇన్‌ఫెక్షన్ మొదలై, మాస్టైటి?సకు దారి తీస్తే, యాంటీబయాటిక్స్ తీసుకోవాల్సి వస్తుంది. అరుదుగా కొందరికి చిన్న సర్జరీ అవసరమవుతుంది.





## 20 గంటలు నాన్-స్టాప్ షూటింగ్..

### కీర్తి సురేశ్ హార్డ్ వర్క్

జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన పని పట్ల ఎంత అంకితభావంతో ఉంటారో మరోసారి నిరూపించారు. తన తీరిక లేని పని షెడ్యూల్ గురించి ఆమె ఇన్స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. వరుసగా 20 గంటల పాటు షూటింగ్‌లో పాల్గొన్నానని, మొత్తం 41 గంటలుగా నిద్ర లేకుండా ఉన్నానని వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయినప్పటికీ, ఇంత బిజీగా ఉండటాన్ని తాను ఒక అదృష్టంగా భావిస్తున్నానని చెప్పడం ఆమె వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది.తన ఇన్స్టాగ్రామ్ స్టోరీస్‌లో కీర్తి సురేశ్ వరుస పోస్టులు పెట్టారు. ఒక వీడియో క్లిప్‌లో మాట్లాడుతూ, "దాదాపు 24 గంటల తర్వాత ఇప్పుడే నా రూమ్‌లోకి అడుగుపెట్టాను. సుమారు 20 గంటలు పనిలోనే ఉన్నాను. నిన్న ఉదయం 6 గంటలకు బయలుదేరాను, ఇప్పుడు ఉదయం 6 అవుతోంది. అసలు విషయం ఏంటంటే, మరో గంటలో నేను తర్వాతి పనికి బయలుదేరాలి. అయినా ఇవి మంచి సమస్యలే కదా, ఇదే జీవితం. దీన్ని నేను ఒక వరంగా భావిస్తాను" అని అన్నారు.మరో పోస్టులో, "నిన్న ఈ పోస్ట్ పెట్టేంత శక్తి కూడా లేదు. ఒక షూట్ నుంచి మరో షూట్‌కు పరుగులు. 41 గంటలు మెలకువగానే ఉన్నాను" అని రాసుకొచ్చారు. ఇంతటి అలసట మధ్య, కేవలం గంట మాత్రమే విరామం దొరికినా, మళ్లీ పనికి వెళ్లే ముందు ఒక మిర్రర్ సెల్ఫీ తీసుకునేంత శక్తి తనకు ఉందని చమత్కరించారు. ఆ సెల్ఫీని కూడా ఆమె పోస్ట్ చేశారు.అనంతరం మరో షూట్‌కు వెళుతున్న వీడియోను పంచుకున్నారు. ఆ వీడియోలో ఆమె "ఐ విల్ సర్వైవ్ (నేను నిలబడగలను)" అని రాసి ఉన్న టీ-షర్ట్‌ను చూపిస్తూ, "ఈ రోజు ఈ టీ-షర్ట్‌కు నిజంగా ఒక అర్థం ఉంది... అవును నేను నిలబడతాను" అని అన్నారు. ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలో 'సత్యవాన్ సావిత్రి', 'రఫ్తార్', 'అక్క', 'రౌడీ జనార్ధన' వంటి పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటితో పాటు 'వెంకీ-అనిల్ రావిపూడి5' చిత్రంలో కూడా నటిస్తున్నారు. ఈ వరుస సినిమాలే ఆమె బిజీ షెడ్యూల్‌కు కారణమని స్పష్టమవుతో

# SPORTS

## విరిసిన భారతీయం




గ్లాస్గో: పదకొండు రోజులపాటు క్రీడాభిమానులను అలరించిన గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ అట్టహాసంగా ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి ఓవో హైడ్రో స్టేడియంలో ది వరల్డ్ వన్ ఫ్యామిలీ (వసుధైక కుటుంబం) పేరిట వైభవంగా జరిగిన ఈ వేడుకల్లో భారతీయ సాంస్కృతిక నృత్య రూపకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 2030 కామన్వెల్త్ శతాబ్ది ఉత్సవాలకు ఆతి?థ్యమివ్వనున్న భారత్‌కు లాంఛనంగా గేమ్స్ పతాకాన్ని అందించారు. కింగ్ చార్లెస్ 3 తరపున హాజరైన ప్రిన్స్ ఎడ్వర్డ్ ఈ క్రీడలు ముగిసినట్టు ప్రకటించి, నాలుగేళ్ల తర్వాత అథ్లెట్లను అహ్మదాబాద్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. అంతకుముందు సంగీతం, నృత్యం, పురాతన కథలు, సంప్రదాయాలతో భారత దేశ ఉజ్వల సంస్కృతిని చాటేలా ప్రదర్శనలు జరిగాయి. అలాగే ఇండో-స్కాటి?ష కు చెందిన సంగీతకారులు, నృత్యకారులు కలిసి చేసిన జుగల్‌బందీ ఆకర్షణగా నిలిచింది.

పాటల జోరు.. నృత్యాల హోరు: ముగింపు వేడుకల్లో మొదట స్కాట్లాండ్, ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత గాయకులు క్యామీ బార్నెస్, డెల్టా గుడ్రెమ్ తమ పాటలతో హుషారెత్తించారు. అనంతరం ఆయా దేశాల నుంచి ఫ్లాగ్ బేరర్స్ తమ జాతీయ పతాకాలతో స్టేడియంలోకి వచ్చారు. భారత్ తరపున బాక్సర్ జాస్మిన్ లంబోరియా త్రివర్ణ పతాకధారిగా వ్యవహరించింది. ఆఖర్లో 2030 ఆతిథ్య అహ్మదాబాద్ పేరును చూపారు. ఈ సమయంలో కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని కిందికి దించి అధికారికంగా భారత్‌కు అందించారు. అనంతరం భారత క్లాసికల్, జానపద సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన నృత్య ప్రదర్శనకు మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్ నాయకత్వం వహించింది. గాయకుడు శంకర్ మహదేవన్ ఆలపించిన వందేమాతర గీతం హృదయాలను తాకింది. అలాగే భారత దేశ పరిణామక్రమాన్ని చాటేలా తయారుచేసిన వీడియో ఆసక్తిని రేకెత్తించింది. చారిత్రక కట్టడాలు, సంస్కృతీ సంప్రదాయాలు, గుజరాత్ వారసత్వం నుంచి ఆధునిక క్రీడా విజయాల వరకు ఇందులో చూపారు. సింగర్ మహదేవన్ తన కుమారుడు, సోదరుడితో కలిసి భాగ్ మిల్కా భాగ్ గీతాన్ని ఆలపించి ప్రేక్షకుల హుషారును పెంచాడు. ఆ తర్వాత సింగర్ భూమి త్రివేది కూడా తనతో చేరి లెహ్రా దో, సబ్‌సే ఆగే హోంగే హిందుస్తానీ లాంటి గీతాలతో ఉర్రూతలూగించారు. ఇక ప్రిన్స్ ఎడ్వర్డ్ ముగింపు ప్రసంగంలో తమ విజయాలతో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చినందుకు అథ్లెట్లకు కృతజ్ఞతలు తెలిపి గేమ్స్ ముగిసినట్టుగా ప్రకటించారు.

అహ్మదాబాద్ క్రీడల కౌంట్‌డౌన్ మొదలు

ముగింపు వేడుకల సందర్భంగా తదుపరి క్రీడల కోసం కామన్వెల్త్ గేమ్స్ బ్యాటన్‌ను భారత్‌కు అప్పగించారు. ఈ అధికారిక బదిలీలో భాగంగా మార్చ్‌పాస్ట్ ద్వారా తీసుకువచ్చిన గేమ్స్ పతాకాన్ని కామన్వెల్త్ స్పోర్ట్స్ ప్రెసిడెంట్ డాక్టర్ డొనాల్డ్ రుకారె.. మొదట జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు అందించాడు. ఆ తర్వాత చోప్రా భారత ఒలింపిక్ సంఘం చీఫ్ పీటీ ఉషకు అందజేశాడు. ఆమె గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవికి పతాకాన్ని అందించడంతో.. 2030లో అహ్మదాబాద్ వేదికగా జరిగే గేమ్స్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది.

## ఫుడ్ పాయిజనింగ్.. లేదంటే స్వర్ణం వచ్చేది




న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడలకు ముందు ఫుడ్ పాయిజన్‌తో డయేరియా బారిన పడ్డానని, లేదంటే గ్లాస్గోలో స్వర్ణం సాధించి ఉండేవాడినని ట్రిపుల్ జంపర్ సెల్వ ప్రభు అన్నాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ (16.58 మీ.) రజతం, ప్రభు సెల్వ (16.52 మీ.) కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. చిత్రవేల్, ప్రభు ఇద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనార్హం. 'నాకు స్వర్ణం లభిస్తుందని అనుకున్నా. కానీ పోటీలకు వారం రోజుల ముందు ఫుడ్ పాయిజన్ అయ్యి డయేరియా బారిన పడ్డా. దాంతో నీరసించిపోయా' అని సెల్వ వెల్లడించాడు.

## కోహ్లి కోపం వెనుక దురుద్దేశం ఉండదు

### మాజీ అంపైర్ అనిల్ చౌదరి



చూపించే ఆవేశం వెనుక ఎలాంటి దురుద్దేశాలు ఉండవని మాజీ అంతర్జాతీయ అంపైర్ అనిల్ చౌదరి స్పష్టం చేశారు. జియోహాట్‌స్టార్ టాక్ షోలో పాల్గొన్న ఆయన, కోహ్లి లాంటి ఎనర్జెటిక్ ప్లేయర్లు ఉన్నప్పుడే క్రికెట్‌కు అసలైన మజా వస్తుందని పేర్కొన్నారు.'చిన్నప్పటి నుంచి విరాట్‌కు అంపైరింగ్ చేయడం వల్ల అతని మనస్తత్వం నాకు తెలుసు. కొన్నిసార్లు మైదానంలో చాలా తీవ్రంగా స్పందించినప్పటికీ, మనం సరైన నిర్ణయం ఇస్తే వెంటనే 'థంబ్స్ అప్' చూపిస్తాడు. ఓవర్ల మధ్యలో మా దగ్గరకు వచ్చి ఎంతో ఆప్యాయంగా మాట్లాడతాడు. విరాట్ లాంటి క్రీడాకారులు లేకపోతే క్రికెట్ మ్యాచ్‌లు ఎంతో బోరింగ్‌గా మారుతాయి' అని అనిల్ చౌదరి వివరించారు. ఉత్తరాది ఆటగాళ్ల రక్తంలోనే పోటీతత్వం, వేడి ఉంటాయని, అది హద్దులు దాటనంత వరకు ఆటకి అందాన్ని ఇస్తుందని అభిప్రాయపడ్డారు.మరోవైపు మైదానంలో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో బ్యాటర్లు ముందే క్రీజ్ దాటడంపై స్పందిస్తూ.. రాబోయే ఒకటి లేదా రెండేళ్లలో ఐసీసీ కీలక మార్పులు తీసుకువస్తుందని చౌదరి అన్నారు. వరుసగా తప్పులు చేస్తే పరుగుల జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయని అనిల్ జోస్యం చెప్పారు. అలాగే సీనియర్ ఫాస్ట్ బౌలర్ ఉమేష్ యాదవ్ మాట్లాడుతూ, ఒత్తిడి సమయాల్లో అంపైర్లను ఇబ్బంది పెట్టడానికి బౌలర్లు చమత్కారంగా 'కళ్లద్దాలు పెట్టుకోవచ్చు కదా సార్.. ఏమైనా మంచు కప్పేసిందా?' అని కామెంట్లు చేస్తూ ఆటలో వినోదాన్ని నింపుతారని వెల్లడించారు.ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా.. మాజీ అంపైర్ స్టీవ్ బక్నర్‌తో వీరేందర్ సెహ్వాగ్ చేసిన సరదా వ్యాఖ్యలను గుర్తు చేసుకున్నారు. సచిన్ టెండూల్కర్‌కు బక్నర్ తప్పుడు నిర్ణయాలు ఇస్తుండటంతో ఆగ్రహించిన సెహ్వాగ్.. 'స్టీవ్.. నీ వయస్సు ఎంత? అని అడిగారు.52 లేదా 53 ఏళ్లు ఉంటాయని స్టీవ్ సమాధానం చెప్పాడు. వెంటనే స్పందించిన సెహ్వాగ్.. నీకు కళ్ళు సరిగ్గా కనిపించవు, చెవులు వినిపించవు, వెంటనే రిటైర్ అయిపోవచ్చు కదా' అని నేరుగానే అన్నట్లు చోప్రా వెల్లడించారు.


Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.